## సభలు, ర్యాలీలకు అనుమతులు తప్పని సరి

- 'సువిధ యాప్'తో పర్మిషన్ పొందాలి
- రాజకీయ పార్టీ నేతల సమావేశంలో అధికారులు

శాయంపేట, అక్టోబర్ 17 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేదంటే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు. శాయంపేట మండలపరిషత్ హాల్‌లో ఎన్నికల కోడ్ అమలుపై రాజకీయ పార్టీ నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కరు కూడా రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి అమంచ కృష్ణమూర్తి, తహసీల్దార్ సుభాషిణి, ఎస్సై దామెరుప్పుల దేవేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంసీసీ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ గోడలపై వాల్‌రైటింగ్ కోసం గట్లకానిపర్తి గ్రామంలో మాత్రమే ఒకరు అనుమతి తీసుకున్నారన్నారు. ఎక్కడ కూడా అనుమతి తీసుకోలేదన్నారు. గోడలపై రాతలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ ఉన్నట్లయితే పార్టీ అభ్యర్థి ఖర్చులో రాయడం జరుగుతుందన్నారు. పార్టీ నేతలు అభ్యర్థులకు ఇబ్బందులు తెచ్చేలా వ్యవహరించవద్దని సూచించారు. సువిధయాప్ ద్వారా సభలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటు అడిగే సమయంలోను ఐదుగురికి మించి ఉండొద్దన్నారు. గ్రామాల్లోని కూడళ్లలో పెట్టే సభలకు కూడా సువిధయాప్‌లో సులువుగా అనుమతులు తీసుకోవాలని లేకపోతే కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా ఏది చేసినా చర్యలు తీసుకుంటామని, పూర్తి నిఘా పెట్టామని అన్నారు. ఎస్సై దేవేందర్ మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకు, వాహన పర్మిషన్లను తీసుకోవాలని 'సీ-విజిల్‌యాప్‌తో అనుమతలు పొందాలన్నారు. పోలీసు నుంచి ప్రచారంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మండలంలో ప్రత్యేకంగా మూడు నిఘా బృందాలు తిరుగుతున్నాయన్నారు. ప్రతి దానిని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. ఒక వాహనంలో వెళ్లేవారు నలుగురుంటే వారందరిలోనూ రూ.50వేలకుపైగా నగదు ఉన్నా సీజ్ చేస్తామన్నారు. వాహనాల్లో రాజకీయ పార్టీల పోల్ స్లిప్‌లు, జెండాలు ఉంటే రూ.50వేలకు తక్కువగా నగదు ఉన్నా స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రజలు జాగ్రత్తంగా డబ్బు విషయంలో నడుచుకోవాలన్నారు. రశీదులు తప్పనిసరిగా ఉండాలన్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ కోడ్ అమలులో కఠినంగా వ్యవహరిస్తుందని రాజకీయ పార్టీ నేతలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి కృష్ణమూర్తి

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

సంగెం, అక్టోబర్ 17 : శాసనసభ ఎన్నికల సందర్భంగా సంగెం మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను సోమవారం ట్రైనీ కలెక్టర్ శారదశుక్లా పరిశీలించారు. మండలంలోని సంగెం, చింతలపల్లి, ఎల్గూర్‌రంగంపేట, తిమ్మాపురం, తీగరాజుపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లలో ఆమె సదుపాలయాలను పరిశీలించారు. ఆయా స్టేషన్‌లలో కరెంటు, నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలపై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లలో అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆయనను ఆదేశించారు. వారి వెంట తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహశీల్ సిబ్బంది ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాల తనిఖీ

శాయంపేట, అక్టోబర్ 17 : మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి ఐలయ్య, ఎస్సై దేవేందర్‌లు మంగళవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని ప్రగతిసింగారం రూట్‌లో పత్తిపాక, హుస్సేన్‌పల్లి, మైలారం, ప్రగతిసింగారం గ్రామాల్లోని పోలింగ్ నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ సెంటర్లను సందర్శించారు. నవంబర్ 30న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఓటర్లకు అన్ని వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీరు, ర్యాంప్, టాయిలెట్స్ ఉండాలని సూచించారు. పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డిలున్నారు.

### సర్వాపురంలో నేత్రదానం

నడికూడ, అక్టోబర్ 17 : మండలంలోని సర్వాపురం గ్రామంలో కుర్ల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు భార్య లక్ష్మి, కుమారుడు రాజేందర్, కుమార్తెలు రమ, కవిత తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం మల్లయ్య నేత్రాలను దానం చేశారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది నరేందర్ కార్నియ సేకరణ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం ఎనిమిది గంటల లోపు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు చూపు ఇవ్వడంతో పాటు, నేత్ర వైద్య విద్యకు ఉపయోగపడుతుందన్నారు.

### నాగేంద్రస్వామి ఆలయంలో భక్తుల పూజలు

గీసుగొండ, అక్టోబర్ 17 : మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామి మాలధారణ చేసుకున్న భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని పుట్టపై నేరుగా సూర్యకిరణాలు ప్రసవించాయని అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తలిరవచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### చంద్రఘంటా అలంకరణలో అమ్మవారు

శాయంపేట/ఆత్మకూరు, అక్టోబర్ 17 : శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో చంద్రఘంట అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు అనుదీప్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇమ్మడిశెట్టి రవీందర్, తెలంగాణ జాగృతి నేత అమ్మ అశోక్, కొత్వాల్ కిరణ్, ముల్కనూరి సాంబమూర్తి కడవెండి ఆనందచారి పాల్గొన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దుర్గామాతను చంద్రఘంట అవతారంలో అలంకరించారు. భజన మండలి సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## సఖీ కేంద్రం సేవలను ఉపయోగించుకోవాలి

### సఖీ వన్‌స్టాఫ్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

ఆత్మకూరు, అక్టోబర్ 17 : మహిళలు సఖీ వ న్ స్టాఫ్ కేంద్రాలను ఉపయోగించుకోవాలని సఖీ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. పెంచికలపేట గ్రామంలో మంగళవారం సర్వోదయ యూ త్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ వారు ఆధ్వర్యంలో సఖీ వన్ స్టాఫ్‌సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సఖీ కేం ద్రానికి వచ్చిన మహిళలకు ఉచితంగా కౌన్సెలిం గ్, న్యాయ సాయం, వైద్య సాయం, తాత్కాలిక వసతి వంటివి అందిస్తుందన్నారు. ఈ అవకాశా న్ని ఉపయోగించుకోవాలన్నారు. సమస్యలను తె లిపేందుకు 0870-2452112లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని శ్రీదేవి సూచించారు. కేస్ వర్కర్స్ వీనల, మహిళలు పాల్గొన్నారు.


సఖీ వన్ స్టాఫ్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న మహిళలు

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు, అక్టోబర్ 17 : నీరుకుళ్ల క్రాస్ సమీపంలో మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో బలమైన గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన మార్త రమేశ్ హనుమకొండకు వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్ సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని మార్త రమేశ్ వెనుక నుంచి ఢీ కొట్టడంతో అతనికి బలమైన గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. బలమైన గాయాలైన రమేశ్‌ను హాస్పిటల్‌కు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నల్లబెల్లం పట్టివేత

నడికూడ, అక్టోబర్ 17 : కారులో అక్రమంగా నల్లబెల్లం, పటికను తరలిస్తుండగా పరకాల ఏసీపీ కిశోర్ సిబ్బందితో సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు.


కారులోని బెల్లం బస్తాలను చూపుతున్న ఏసీపీ కిశోర్

ఏసీపీ కిశోర్ తెలిపిన ప్రకారం.. రూట్ వాచ్‌లో భాగంగా నడికూడ మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా హుజురాబాద్ రోడ్ నుంచి మారుతి 800కారు పోలీసులను చూసి ఆపకుండా వెళ్లింది. వెంటనే పోలీసు వాహనంలో వెంబడించగా కారు డ్రైవరు వాహనాన్ని పక్కన ఆపి పారిపోయాడు. కారులో పరిశీలించగా సుమారు రూ.58వేల విలువ గల 32బస్తా ల నల్ల బెల్లం, పది కిలోల పటిక దొరికింది. వాటినని స్వాధీనం చేసుకుని వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై చట్టరీత్యా చర్య కోసం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డిపార్టమెంట్ వంగ రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఏసీపీ కిశోర్ తెలిపారు. కానిస్టేబుల్స్ వేణుగోపాల్, రొంటాల శంకర్ పాల్గొన్నారు.

### 21మంది డీజే నిర్వాహకుల బైండోవర్

శాయంపేట, అక్టోబర్ 17 : మండల పరిధిలోని గ్రామాలకు చెందిన 21మంది డీజే సౌండ్స్ నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు ఎస్సై దేవేందర్ మంగళవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో డీజే సౌండ్స్ పెట్టడం నిషేధమన్నారు. అనుమతులు లేకుండా డీజేలు వినియోగించవద్దని స్పష్టం చేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కృష్ణకాలనీ, అక్టోబర్ 17 : భూపాలపల్లి పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఖాళీ నివేశన స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం, మురికి కాలువల్లో నీరు ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. సిబ్బంది వెంటనే వీటిని గుర్తించి యాజమానులకు సమాచారమందించి పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ వారు స్పందించని ప క్షంలో సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించి యాజమానులకు జరిమా నా విధించాలని ఆదేశించారు. అలాగే పట్టణంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తక్షణమే తొలగించాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై తగిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను వార్డు ఆఫీసర్స్ సందర్శించి మౌలిక వసతులు, మరుగుదొడ్లు, ర్యాంప్స్, విద్యుత్, మంచినీరు, ఫర్నిచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు సూచించారు. సమావేశంలో భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, టీపీవో సునీల్, టీవో మానస, మేనేజర్ స్వామి, ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

### సతీశ్‌రెడ్డికి అబ్దుల్ కలాం అవార్డు

రేగొండ, అక్టోబరు 17 : మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రచయిత కామిడి సతీశ్‌రెడ్డికి అబ్దుల్ కలాం జాతీయ అ వార్డును ఉమ్మడి జిల్లా లే బర్ కోర్టు జడ్జి వై సత్యేంద్ర మంగళవారం అందజేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా హనుమకొండలో జాతీయ స్థాయి అబ్దుల్ కలాం టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యేంద్రతో పాటు సీనియర్ సూపరింటెండెట్ ఆఫ్ ఎస్ఎస్ కోర్ట్ అంజనీకుమారి, ఫౌండర్ వెనిశెట్టి రవికుమార్, అవోపా జిల్లా గవర్నర్ అవార్డుతో పాటు ప్రసంశా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డిని సర్పంచ్ బీక్యానాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

### నూతన సీపీకి పలువురి శుభాకాంక్షలు

శాయంపేట, అక్టోబర్ 17 : వరంగల్ నగర పోలీస్ కమిషనర్‌గా నూతనంగా విధుల్లో చేరిన అంబర్‌కిషోర్‌ఝాను శాయంపేట మండలానికి చెందిన పలువురు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక శివాలయ ఆలయ అర్చకులు అనుదీప్ శర్మ, తెలంగాణ జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ సీపీని కలిసి శాలువాతో సన్మానించారు. ఆలయంలోని శివలింగం ఫొటోను బహూకరించారు. రవీందర్, కిరణ్, మోహన్, సాయి పాల్గొన్నారు.


సీపీకి ఫోటోను బహూకరిస్తున్న అర్చకుడు, నేతలు

### దామెరలో మద్యం పట్టివేత

దామెర, అక్టోబర్ 17: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాదారపు లింగమూర్తికి చెందిన రూ.14,930 విలువల గల ఐడీ లిక్కర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ మంగళవారం తెలిపారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు లింగమూర్తి ఇంట్లో తనిఖీ చేయగా మద్యం లభ్యమైందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.